క్లుప్తంగా

వారంలోపు వర్క్‌ఆర్డర్లు పూర్తి చేయాలి

చిత్తూరు కార్పొరేషన్‌: ట్రాన్స్‌కో పరిధిలో 2019–20 సంవత్సరం వరంగా వర్క్‌ఆర్డర్లను వారం లోపు క్లోజ్‌ చేయాలని ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈఈలకు ఆదేశాలు జారీ చేశారు. ఇంక వర్క్‌ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్న ఏఈలు వాటిని పూర్తి చేయకపోతే చర్యలు తప్పవన్నారు. పనివిలువ మొత్తం రికవరీ అయ్యే వరకు జీతాల నుంచి ఆ మొత్తం రికవరీ చేస్తామని హెచ్చరించారు. ఎంతకూ మార్పు లేకపోతే సహించేది లేదన్నారు.

పేదలకు కార్పొరేట్‌ వైద్యం



పుణ్యసముద్రంలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్‌ ప్రియాంక

తవణంపల్లె: పల్లెల్లో నివసిస్తున్న పేదలకు కార్పొరేట్‌ స్థాయిలో వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 55 మందికి వైద్య పరీక్షలు చేయించి మందులు, మాత్రలు అందజేశారు. గర్భిణులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. పీహెచ్‌సీలో ప్రసవాలు చేయిస్తున్నామని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దే మెరుగైన వైద్యం

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్‌ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్‌ రష్మిత అన్నారు. మండలంలోని చామంతిపురం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం మంచాన పడ్డ రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. వైద్య సిబ్బంది యమున, శ్రీలక్ష్మి, దేవప్రీత, రాధ పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడవద్దు

గుడిపాల: ఎన్నికల సమయంలో ఎటువంటి గొడవలకు పాల్పడకూడదని ఎస్‌ఐ శ్రీనివాస రావు తెలిపారు. మండలంలోని పశుమంద గ్రామంలో శనివారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరితోనూ గొడవలకు వెళ్లకూడదన్నారు. గ్రామాల్లో అనుమానితులను గుర్తిస్తూ వెంటనే 9440796712కు ఫోన్‌ చేయాలన్నారు.

క్యాంటీన్‌ నిర్వహణకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న క్యాంటీన్‌ నిర్వహణకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్‌ జీవనజ్యోతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25లో క్యాంటీన్‌ నిర్వహణకు ఈ నెల 29 లోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 8919962288ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

రోడ్డు నియమాలు పాటించండి



మాట్లాడుతున్న సీఐ సుదర్శన ప్రసాద్‌

పూతలపట్టు: మండలంలోని ఆటో డ్రైవర్లు రోడ్డు నియమాలను పాటించాలని సీఐ సుదర్శన ప్రసాద్‌ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆటో డ్రైవర్లతో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆటో నడిపే డ్రైవర్లకు తప్పకుండా లైసెన్సు ఉండాలని, నలుగురిని మించి ఆటోలో ప్రయాణించకూడదని తెలిపారు. డ్రైవర్లకు కేటాయించిన స్టాండ్‌లోనే ఆటోలను పార్క్‌ చేయాలని, బస్టాండ్లలో ప్రయాణికులకు ఇబ్బందికరంగా పార్క్‌ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులకు ఎక్కించుకొని జాతీయ రహదారిపై ప్రయాణించడం నేరమని, సర్వీస్‌ రోడ్డులో మాత్రమే ప్రయాణించాలని తెలిపారు. విద్యార్థులను ఎక్కించుకున్నప్పుడు డ్రైవర్‌ సీట్లో కూర్చోబెట్టుకొని ప్రయాణించకూడదని, మద్యం తాగి వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు రమణారావు, మనోహర్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపు పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: మండలంలోని అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 25వ తేదీన సోమవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామికి ఉభయదారులచే అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తామన్నారు. 11 గంటలకు సుదర్శన హోమం, రాత్రి ప్రాకారోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

చిత్తూరు అర్బన్‌: వేసవి వస్తున్న దృష్ట్యా చిత్తూరు నగరంలో ప్రజలకు ఎక్కడా కూడా నీటి సమస్య రాకుండా చూడాలని మునిసిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ అరుణ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్‌ కార్యాలయంలో శనివారం ఇంజినీరింగ్‌ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్‌ మాట్లాడుతూ ఈ వేసవిలో నగరంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కలవకుంట జలాశయం, బోర్ల ద్వారానే సరఫరా అవుతున్న నీళ్లు, ప్రజల వినియోగానికి కావాల్సిన నీటిని అంచనాలు వేయాలని చెప్పారు. ప్రస్తుతం బోర్లలో వస్తున్న నీటి సామర్థ్యం, ఎంతమందికి సరిపోతుంది అన్న విషయాలపై పూర్తి స్థాయి నివేదికలు అందించాలని సూచించారు.



జలాశయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, తదితరులు

లీకేజీలు ఇతర మరమ్మతులపై నివేదిక సమర్పించి, వీటిని పూర్తిచేయడానికి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో మునిసిపల్‌ ఇంజనీరు గోమతి, డీఈలు వెంకట ప్రసాద్‌, రమణ, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం పెనుమూరు రోడ్డులో ఉన్న కలవకుంట జలాశయాన్ని అధికారులతో కలిసి కమిషనర్‌ పరిశీలించారు. ఇంజినీరింగ్‌, నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. జలాశయంలో ప్రస్తుతం 88 ఎంసీఎఫ్టీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. జలాశయంలోని నీటిని ప్రణాళిక బద్ధంగా వినియోగించుకోవాలన్నారు. జలాశయం పంప్‌ హౌస్‌ను పరిశీలించారు. మోటార్ల వినియోగ సమయం, రికార్డులను తనిఖీ చేశారు. మోటార్లు, పంపుసెట్లు పక్కాగా పర్యవేక్షించాలని, అవసరమైన మరమ్మతులను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. నీటి సరఫరాలో లీకేజీ లేకుండా చూడాలని ఇంజనీరింగ్‌ అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా, లీకేజీలను వార్డు స్థాయిలో క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. కమిషనర్‌ వెంట నీటిపారుదల శాఖ ఏఈ భాస్కర్‌ రెడ్డి, కార్పొరేషన్‌ ఏఈలు పాల్గొన్నారు.

మీ ‘ఓటు’ మా భవిష్యత్తు

చిత్తూరు అర్బన్‌: ‘మీ ఓటు మా భవిష్యత్తు’ అంటూ విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై వినూత్నంగా ప్రచారం చేశారు. స్వీప్‌ కార్యక్రమాల్లో భాగంగా ఏఆర్వో, చిత్తూరు మునిసిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ అరుణ ఆదేశాలతో స్వీప్‌ నోడల్‌ బృందం వినూత్నంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా శనివారం కస్తూరిబా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో స్వీప్‌ అక్షర క్రమంలో ప్రదర్శన నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు పొందాలని సూచించారు. ఓటు హక్కు కలిగిన వారంతా తప్పకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. నగరపాలక స్వీప్‌ నోడల్‌ అధికారి చిన్నయ్య ఆధ్వర్యంలో స్వీప్‌ బృందం సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్వీప్‌ అక్షరమాలతో విద్యార్థులు

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీల్లో గెలుపొందిన సర్టిఫికెట్, బహుమతులను చూపుతున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్‌ : ప్రతి విద్యార్థికి క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని దేవి పాఠశాల కరస్పాండెంట్‌ ఎస్‌.ఆర్‌.ప్రసాద్‌ అన్నారు. గిరింపేటలోని ఆ పాఠశాలలో శనివారం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని చెప్పారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం భార్గవి, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

చిత్తూరు కార్పొరేషన్‌: భగత్‌సింగ్‌ వర్ధంతి సందర్భంగా సీపీఐ నాయకులు నగరంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. బ్రిటీష్‌ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భగత్‌సింగ్‌ చిన్న వయసు నుంచే పోరాటాలు చేశారన్నారు కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్‌ నాయకులు రమాదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పంగుణి బ్రహ్మోత్సవాలు



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్‌: చిత్తూరు నగరంలోని ఈశ్వరగుడివీధిలో వెలసిన శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయంలో శనివారం పంగుణి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలస్థానంలోని స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా హోమాలు జరిపించారు. ఈ పూజల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పాల్గొన్నారు. పండితులు లోకకల్యాణార్థం నిర్వహించే ఈ హోమ పూజ ఘటాన్ని ఆయనకు వివరించారు. తదనంతరం ఆయనకు స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ శివకుమార్‌, అర్చకులు శివ పాల్గొన్నారు.

భయాన్ని వీడితేనే ఉన్నత స్థితి

తవణంపల్లె: మనిషి ఉన్నతి స్థితికి ఎదగాలంటే తమలో ఉన్న భయాన్ని, అహాన్ని విడనాడాలని నెల్లూరుకు చెందిన ఆంజనేయ పిరమిడ్‌ ధ్యాన కేంద్రం వ్యవస్థాపకులు, సీనియర్‌ పిరమిడ్‌ మాస్టర్‌ చైతన్యలక్ష్మి ధ్యానులకు సూచించారు. మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్‌ మహా శక్తి క్షేత్రంలో శనివారం ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. అందులో చైతన్యలక్ష్మి ప్రసంగిస్తూ తమపై తమకు నమ్మకం ఉండాలన్నారు. తమను తాము ప్రేమించినప్పుడే ఇతరులను ప్రేమిస్తారని పేర్కొన్నారు. ధ్యానంపై నమ్మకం, తమపై విశ్వాసం, క్షమాగుణం, ప్రేమతత్వం, దానగుణం ఉంటే మానవుడు మాధవుడుగా ఎదుగుతారని వివరించారు. ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా చేసే సాయం ఎప్పటికీ వృథా కాదన్నారు. పిరమిడ్‌ మాస్టర్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పిరమిడ్‌ స్పిరిచువల్‌ సొసైటీ, గ్లోబల్‌ స్పిరిచువల్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకులు డాక్టర్‌ బి.గోపాలకృష్ణమూర్తి, ట్రస్టు కన్వీనర్‌ రాధిక, ధ్యానులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పిరమిడ్‌ మాస్టర్‌ చైతన్యలక్ష్మి

కట్టుదిట్టంగా కోడ్‌ అమలు చేయాలి

బంగారుపాళెం: సార్వత్రిక ఎన్నికల కోడ్‌ను మండలంలో అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎంపీడీఓ శివశంకర్‌ సూచించారు. మండలంలో పలు గ్రామ సచివాలయాలను శనివారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్‌ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్‌ అమలు చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన ప్రదేశాల్లో మోడల్‌ కోడ్‌ తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని హెచ్చరించారు.



ఎన్నికల కోడ్‌పై సూచనలు చేస్తున్న ఎంపీడీవో

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ప్లాస్టిక్‌ వాడకం నిషేధంపై అవగాహన కల్పిస్తున్న పీవీకేఎన్‌ ఎన్‌సీసీ కేడెట్లు

చిత్తూరు కలెక్టరేట్‌ : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పీవీకేఎన్‌ ప్రిన్సిపల్‌ డా.జీవనజ్యోతి అన్నారు. ఆ కళాశాల ఆవరణలో శనివారం ప్రపంచ వాతావరణ దినోత్సవం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పట్ల యువత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్‌ వినియోగించకూడదని తెలిపారు. ప్లాస్టిక్‌ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. అడవులను సంరక్షించుకోవాలని చెప్పారు. అనంతరం ఆ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు పాఠశాల ఆవరణలోని వ్యర్థ పదార్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపల్‌ మీరాసాహెబ్‌, అధ్యాపకులు రమేష్‌, హరిప్రసాద్‌, భానుప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



యాదమరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



తవణంపల్లె: ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

యాదమరి: క్షయవ్యాధిపై ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో శనివారం ఉదయం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెయిన్‌ బజారులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి అనిల్‌కుమార్‌ నాయక్‌ మాట్లాడుతూ క్షయవ్యాధి ఎలా వ్యాపిస్తుంది? నివారణ మార్గాల గురించి వివరించారు. రెండు వారాలకు మించి దగ్గుతో బాధపడుతున్నా, సాయంత్రం వేళ జ్వరం వచ్చినా క్షయవ్యాధి సోకినట్లు అనుమానించవచ్చని చెప్పారు. ప్రస్తుతం రెండు రోజులు దగ్గు, జ్వరం సోకి బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉన్న వారికి గల్ల పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. క్షయవ్యాధి సోకినట్లు అనుమానం ఉన్నవారికి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మానవహారం

తవణంపల్లె: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వైద్యాధికారులు, సిబ్బంది క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం టి.పుత్తూరు రోడ్డులో మానవహారం నిర్వహించారు. ర్యాలీలో వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, వినయ్‌కుమార్‌, సూపర్‌వైజర్లు రాజశేఖర్‌, రెడ్డెమ్మ, నిర్మల, సీహెచ్‌ఓ రాజామణి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నేడు ఐరాలలో ర్యాలీ

ఐరాల: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. పీహెచ్‌సీ నుంచి బజారువీధి వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ర్యాలీలో ఏఎన్‌ఎంలు, ఏంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొనాలని కోరారు.

టీబీ దినోత్సవ ర్యాలీ

చిత్తూరు రూరల్‌: ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చిత్తూరులో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్‌ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి అవగాహన ర్యాలీ ప్రారంభమై గాంధీ విగ్రహంతో ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు.

నిరుపేదల సొంతింటి కల సాకారం

- పేదలందరికీ గృహాలు ఓ వరం
- 14 జగనన్న లే ఔట్లలో 1,684 మందికి పక్కా గృహాలు మంజూరు
- మండలంలో ఇప్పటివరకు 1301 గృహ నిర్మాణాలు పూర్తి

తవణంపల్లె: ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పేదలందరికీ ఇళ్ల పథకంతో సొంతింటి కల సాకారమైంది. గత ప్రభుత్వంలో పేదలకు ఇల్లు మంజూరు చేయాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. సంక్షేమ సారథిగా పేరుతెచ్చుకున్న ప్రస్తుత ముఖ్యమంత్రి కులమతాలు, రాజకీయాలకతీతంగా నిరుపేదలకు వలంటీర్ల ద్వారా సర్వే చేసి పక్కా గృహాలు మంజూరు చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి స్థలం లేని పేదల కోసం భూములు చదును చేయించారు. అందులో లే ఔట్లు వేసి లబ్ధిదారులకు స్థలం కేటాయించి, పట్టాలు మంజూరు చేసి రిజిస్ట్రేషన్‌ చేయించే కార్యక్రమం పూర్తయింది. మండలంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద 1,684 మందికి నిర్మాణాలు మంజూరయ్యాయి.



తవణంపల్లెలో జగనన్న లే ఔట్‌లో నిర్మించిన ఇండ్లు

ఇందులో 1,301 నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసి గృహప్రవేశం చేశారు. మండలంలో 175 ఇళ్ల పునాదులు వేశారు. 110 ఇళ్ల గోడలు పూర్తయినవి. 92 ఇళ్లు మోల్డింగ్‌ దశలో ఉన్నాయి. లబ్ధిదారులకు 1,11,229 సిమెంటు బస్తాలు అందజేశారు. రూ.20,52,35,063 వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. రూ.3,04,59,348 మెటీరియల్‌ కింద బిల్లులు చెల్లించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయడంతో సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



తవణంపల్లెలో జగనన్న లే ఔట్‌

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు



ఇంటి స్థలం మంజూరు చేయాలని అధికారుల చుట్టూ ఎన్నో ఏళ్లుగా తిరిగినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఎంత మందిని అడిగినా న్యాయం జరగలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాకు ఇల్లు మంజూరు చేశారు. ఇంటి పనులు పూర్తి చేసుకున్నాం. ముఖ్యమంత్రికి మా కుటుంబం ఎప్పటికీ అండగా ఉంటుంది.

– బుజ్జి, దిగువమోదలపల్లె

మాకంటూ ఓ ఇల్లు వచ్చింది



ఇల్లు లేని మా కుటుంబానికి ఇల్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. గతంలో ఎన్నో సార్లు దరఖాస్తులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు వలంటీర్లే వచ్చి, ఇంటి పట్టా ఇచ్చారు. ఇల్లు కూడా నిర్మించుకోవడానికి సిమెంట్‌, ఇసుక, నిర్మాణ సామగ్రి ప్రభుత్వమే అందిస్తోంది. ఇంటి పనులు త్వరలో పూర్తి చేసుకొని గృహప్రవేశానికి ఏర్పాట్లు చేసుకొంటున్నా.

– రోజా, దిగువమోదలపల్లె

అర్హులందరికీ గృహాలు



అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పక్కాగృహాలు మంజూరు చేశాం. మండలంలో 1684 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 1301 గృహాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశలో పనులు కొనసాగుతున్నాయి. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తున్నాం.

– శ్రీధర్, హౌసింగ్‌ ఏఈ, తవణంపల్లె

సొంతింట్లో నిద్రిస్తున్నాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాకు సొంతిల్లు వచ్చింది. ఇంటి నిర్మాణ పనులను పట్టుదలతో కష్టపడి పూర్తి చేసుకొని గృహప్రవేశం చేశాం. సంక్షేమ సారథిగా పేరొందిన జననేత ఇచ్చిన ఇంటిలోనే నిద్రిస్తున్నాం. మా కుటుంబం సంతోషంగా ఉంది.

– శాంతమ్మ, తవణంపల్లె

సొంతిల్లు కల నెరవేరింది



నవత్నాలు –పేదలందరికీ ఇండ్లు పథకంతో సొంతింటి కల నెరవేరింది. పేదలను గుర్తించి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడంతో శ్రద్ధతో నిర్మించుకున్నాం. ఇప్పుడు మాకెంతో సంతోషంగా ఉంది. మా కుటుంబం ఈ ప్రభుత్వానికి అండగా ఉంటుంది.

– హైమావతి, దిగువమోదలపల్లె

అర్హులందరికీ ఇళ్లు



అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. దీంతోపాటు జగనన్న ఇంటి పట్టా రిజిస్ట్రేషన్‌ చేయించి ఇచ్చారు. ఇల్లులేక అవస్థలు పడుతున్న మా కుటుంబానికి ఎంతో ఆదరణ కలిగించారు. ఈ సారి ఈ ప్రభుత్వాన్ని గెలిపించుకుంటాం.

– మీనా, దిగువమోదలపల్లె

పూర్తి చేసుకున్నా..



ఎన్నో ఏళ్ల తరువాత ఈ ప్రభుత్వం మాకు ఇల్లు మంజూరు చేసింది. ఇల్లు కట్టుకోవడానికి సిమెంటు ఇచ్చింది. పనులు చేసిన వెంటనే బిల్లులు రావడంతో పనులు పూర్తి చేసుకున్నాను. ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. ఆయన మేలు ఎప్పటికీ మరువలేం.

– కృష్ణవేణి, దిగువమోదలపల్లె